క్లుప్తంగా

మూతబడిన మూత్రశాలతో అవస్థలు



నగరంపాలెం: జిల్లా కోర్టు ప్రధాన ద్వారం సమీపాన మూత్రశాల ఏళ్లతరబడిగా మూతబడటంతో కక్షిదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. గత్యంతరం లేక కోర్టు పరిసరాలకు అనుకుని ఉన్న ప్రధాన మురుగు కాల్వపై నిల్చుని మూత్రవిసర్జన చేస్తున్నారు. ఒక్కొక్కసారి ప్రమాదశావత్తు కాలు జారి, కాల్వలో పడిన ఘటనలు లేకపోలేదు. ఇప్పటికైనా మూత్రశాలను వాడుకలోకి తేవాలని నగర వాసులు, కక్షిదారులు కోరుతున్నారు.

ముగిసిన ఉచిత మజ్జిగ పంపిణీ



నగరంపాలెం: ఈ వేసవిలో ఎందరో పాదచారులకు మజ్జిగతో దాహార్తి తీర్చామని గుంటూరు వాసవీ క్లబ్ అధ్యక్షుడు అశోక్ కుమార్ తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఏటుకూరు రోడ్డు శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మ వారి దేవస్థానంలో ఉచిత మజ్జిగ పంపిణీ వంద రోజుల ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ దాతలు, క్లబ్ సభ్యుల సహకారంతో నిరంతరాయంగా పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి కూనిశెట్టి చంద్రశేఖరరావు, కోశాధికారి వేమూరి ప్రదీప్‌కుమార్, కె.వి.బ్రహ్మం, పబ్బిశెట్టి చిరంజీవి, దోర్నడ శ్రీనివాస్, అమరా రమేష్, పారేపల్లి బాబ్జి, మజ్జిగ చలివేంద్రం కమిటీ చైర్మన్ గుండా మణిశేఖర్‌రావు, దివ్వెల కోటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని చినకాకాని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయాలపాలైన ఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ నుంచి గుంటూరు వెళుతున్న రెండు ద్విచక్రవాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో వాహనాలపై ప్రయాణిస్తున్న నలుగురు కింద పడడంతో గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు వారిని సమీప ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించారు.

కార్మికులకు న్యాయం చేయాలి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు గురువారం వర్షంలోనూ తమ పోరాటాన్ని ఆపలేదు. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 205 రోజులుగా కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం దీక్షలు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షేక్ సుభాని, ఆశీర్వాదం, బాషా, కార్మికులు వై.సాంబశివరావు, సూర్య ప్రకాశరావు, పిచ్చయ్య, ఆరిఫ్ పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ

ఫిరంగిపురం: మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామంలో గురువారం నుదురుపాడు పశువైద్యశాల ఆధ్వర్యంలో జీవాలకు నట్టల నివారణ మందు(డీవార్మింగ్) ఇచ్చినట్లు పశు వైద్యాధికారి షేక్.పీర్ అహ్మద్ తెలిపారు. 805 గొర్రెలు, 120 మేకలకు నట్టల నివారణ మందు వేశామని ఆయన చెప్పారు. జీవాల పెంపకం దారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. దీని ద్వారా జీవుల శరీరంలో ఉండే పేగు పురుగులు నశించిపోతాయన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, జీవాల పెంపకం దారులు, సిబ్బంది ఉన్నారు.

ఇండస్ట్రీ 5.0 విజన్‌పై అవగాహన సదస్సు

మేడికొండూరు: మండల సమీపంలోని విసదల అడ్డ రోడ్డు వద్ద గల ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో ఇండస్ట్రీ 5.0 విజన్ అనే అంశంపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కంపెనీ సీనియర్ డైరెక్టర్ తురుమళ్ల బాబు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్స్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కలిపి అభివృద్ధి చేసినా, కొన్ని కోట్ల డయోట్స్ నిర్మించిన చిప్స్ ద్వారా అతి తక్కువ ఉద్యోగస్తులతో అత్యధిక అభివృద్ధి సాధించవచ్చునని వెల్లడించారు. ఏఐ, ఎంఐ ద్వారా అనేక ఆవిష్కరణలు సాధించి, నూతన ఆవిష్కరణకు నాంది పలుకవచ్చన్నారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ కోట శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఎంటెక్ పూర్తి చేసి ఒక గొప్ప చిప్ డిజైనింగ్ కంపెనీకి డైరెక్టర్‌గా ఎదగడం సంతోషదాయకమన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ పూర్ణ శేఖర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరంగా విద్యార్థులు అందిపుచ్చుకొని ముందుకు సాగాలని సూచించారు.

మలేరియా ఫీవర్ ఫియర్

మలేరియా జ్వరం..ఈ పేరు చెబితేనే పలువురు వణికిపోతారు. వచ్చిందంటే ఒక పట్టాన వదలదు. నెలల తరబడి పీడిస్తుంది. తీవ్రమైతే ప్రాణానికే ముప్పు. గత ఏడాది జిల్లావ్యాప్తంగా 3,52,748 మందికి రక్తపరీక్షలు చేయగా 10 మందికి సోకింది. ఈ ఏడాది ఐదు నెలల్లో 1,10,890 మందికి పరీక్షలు చేయగా, ఒకరు వ్యాధి బారిన పడినట్లు నిర్ధారణ అయ్యింది. మలేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రతి ఏడాది జూన్‌ను యాంటీ మలేరియా నెలగా ప్రకటించారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం. – గుంటూరు మెడికల్



- వస్తే ఓ పట్టాన వదలదు
- అశ్రద్ధ చేస్తే ప్రాణాలు పోయే ప్రమాదం
- మలేరియా నివారణ అవగాహన మాసం జూన్

మలేరియా వ్యాధి అనాఫిలిస్ అనే దోమకాటు వల్ల వస్తుంది. వర్షాకాలంలో ఎక్కువగా ప్రబలుతుంది. చలి, వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, మూత్రం మందగించడం, లివర్, కడుపులోనొప్పి ఉంటుంది., జ్వరం మూడు రోజులకొకసారి లేదా రెండురోజులకొకసారి లేదా రోజు మార్చి రోజు వస్తూ ఉండటం ఈ వ్యాధి లక్షణాలు.

నిర్ధారణ పరీక్షలు ఉచితం

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ గంట వ్యవధి లోపు వస్తుంది. రక్తపు పూతలు సేకరించి వ్యాధి నిర్ధారణ జరిగితే క్లోరోక్విన్, ప్రైమాక్విన్ అనే మాత్రలను ఉచితంగా ఇస్తారు. న్యూడ్రగ్ పాలసీ 2012 ప్రకారం తప్పనిసరిగా 14 రోజులు మందులు వాడాలి. ఈ ఏడాది చౌడవరం అర్బన్ పీహెచ్‌సీ పరిధిలో ఒక కేసు నమోదైంది.

జిల్లాలో నమోదైన కేసులు

సంవత్సరం	కేసుల సంఖ్య
2021	15
2022	24
2023	21
2024	10
2025	1

దోమల నివారణ ఇలా..

దోమల ద్వారా మలేరియా సోకతుంది కాబట్టి ఇంటి పరిసరాలలో పెరిగేందుకు ఆస్కారం లేకుండా, మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. వారానికి ఒకసారి ఇంటిలో నీటి నిల్వలు లేకుండా డ్రైడే పాటించాలి. ఇంటి ఆవరణలో ఖాళీ కొబ్బరి చిప్పలు, కొబ్బరి బొండాలు, పాత టైర్లు ,రోళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. దోమలు ఇళ్లలోకి రాకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో కిటకీలు, తలుపులు మూసి ఉంచాలి. లెట్రిన్ పైపులకు పైన వస్త్రాన్ని కప్పి ఉంచాలి. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమతెరలు వాడాలి.



యాంటీ మలేరియా పోస్టర్లు

ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత వైద్య సేవలు



జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేసి మందులు సైతం ఉచితంగా అందిస్తున్నారు. జ్వరం తీవ్రత ఎక్కువగా ఉన్నవారికి ఆసుపత్రుల్లో అడ్మిట్ చేసి ఉచిత వైద్యం అందిస్తున్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముఖ్యంగా సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేసి అవగాహన కల్పిస్తున్నారు.

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, గుంటూరు

కచ్చితమైన నిర్ధారణ చేయాలి



సరైన వ్యాధి నిర్ధారణ, చికిత్స చేయని పక్షంలో నెలల తరబడి మలేరియా వ్యాధి పీడిస్తుంది. కొందరిలో సెరిబ్రల్ , వైవ్యాక్స్ మలేరియాలు కూడా వస్తాయి. ఇది సోకిన వారిలో ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడం, కామెర్లు, నిమోనియా, ఫిట్స్, మూత్రపిండాలు చెడిపోవడంతో పాటు స్పృహ కోల్పోడం జరుగుతుంది. మలేరియా ఉన్న వ్యక్తి రక్తం ఎక్కించడం ద్వారా, వ్యాధి ఉన్న వ్యక్తిని కుట్టిన దోమ మనల్ని కుట్టటం ద్వారా సోకుతుంది.

– డాక్టర్ కోగంటి కల్యాణ్ చక్రవర్తి, జ్వరాల స్పెషలిస్ట్, గుంటూరు

ప్రజల్లో విస్తృత అవగాహన



జిల్లాలో మలేరియా నివారణ కోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అవగాహన కోసం ర్యాలీలు కూడా నిర్వహిస్తున్నాం. కేసులు నమోదైన గ్రామాల్లో మలాథిన్ ఫాగింగ్, పైరిత్రమ్ స్ప్రే, యాంటీలార్వా చర్యలు తీసుకుంటున్నాం. జూన్ నుంచి మలేరియా, డెంగీ జ్వరాలు నమోదయ్యే అవకాశం ఉంది. ప్రజలు కూడా వ్యాధులపై అవగాహన కల్గి ఉండి జాగ్రత్తలు తీసుకోవాలి.

– టి.ఎం.కె. సుబ్బరాయణం, జిల్లా మలేరియా అధికారి, గుంటూరు

రోల్‌బాల్ పోటీలకు నగర విద్యార్థుల ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి రోల్‌బాల్ పోటీలకు శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల రోల్‌బాల్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన ఎంపికలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి, వచ్చే నెలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని పేర్కొన్నారు. తమ పాఠశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో సైతం ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్, ప్రైమరీ కో–ఆర్డినేటర్ దిల్ జహాన్ బేగం పాల్గొన్నారు.

వేతనం అందక యాతన

పొన్నూరు: స్థానిక మున్సిపాలిటీలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులకు రెండు నెలలు పూర్తవుతున్నా ఇంకా వేతనాలు అందలేదు. పట్టణ పరిధిలో 110 మంది ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. ఒక్కొక్కరికీ సుమారు రూ.21 వేలు జీతం అందుతోంది. రూ.23 లక్షల వరకు రావాల్సి ఉంది. పలు కారణాలతో గత నెల జీతం అందించడంలో జాప్యం జరిగింది. జూలై 1వ తేదీన రెండు నెలల వేతనాలు జమ చేయనున్నట్లు మున్సిపల్ కార్యాలయం సిబ్బంది పేర్కొంటున్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

గుంటూరు ఎడ్యుకేషన్: మనిషి జీవితాన్ని నాశనం చేసే మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 'మత్తు పదార్థాలు జీవితాలను ఎలా నాశనం చేస్తాయి' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ కామేశ్వరశాస్త్రి మాట్లాడుతూ హానికరమైన గంజాయి, కొకైన్, గుట్కా, పొగాకు వంటి హానికర పదార్థాలను తక్షణమే విడనాడాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.అనితా దేవి, గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వహణాధికారి జేవీ సుధీర్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, సీపీటీ ఇన్‌చార్జ్ జి.సురేష్ కుమార్, పి.అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వాడకం ప్రమాదకరం

నగరంపాలెం: మాదక ద్రవ్యాలు వాడకం ప్రమాదకరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా గురువారం లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జియావుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌పై అవగాహన లేకపోవడంతో వాటికి బానిసలుగా మారుతున్నారని తెలిపారు. అపరిచితుల వద్ద ఎటువంటి పదార్థాలు తీసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు, డీఎస్ బి.అరుణకుమారి, ఏఎస్ మారయ్యబాబు, సీఐలు యశోధర, లత, ప్యానెల్ అడ్వకేట్ కాళిదాసు, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో విద్యార్థులు, అధ్యాపకులు



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: సనాతన రుషి సంస్కృతి వారసత్వంగా ఉన్న యోగా అభ్యాసం ద్వారా మానసిక, శారీరక దృఢత్వం అలవడి సంపూర్ణ ఆయుష్షును పొందవచ్చని గీతా మందిరం మాజీ చైర్మన్ రాయవరపు అశోక్ కుమార్ పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర యోగా కేంద్ర ఆధ్వర్యంలో ఆర్ అగ్రహారంలోని గీతా మందిరంలో 136వ యోగా శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అశోక్ కుమార్ మాట్లాడుతూ పదేళ్ల కిందట ప్రధాని నరేంద్ర మోదీ యోగాను విశ్వవ్యాప్తం చేశారని తెలిపారు. నేడు 195 దేశాలకు పైగా యోగా సాధన చేయడం ద్వారా ప్రపంచం శాంతి వైపు పయనిస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదని పేర్కొన్నారు.యోగా శిక్షకుడు బెల్లంకొండ రమేష్ మాట్లాడుతూ తమ గురువు వేంకటేశ్వరరావు శిష్య పరంపరలో ఒకడిగా గత రెండు దశాబ్దాలుగా 15 వేల మందికి పైగా ఉచితంగా యోగా శిక్షణ అందించామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల స్థాయిలో యోగా సాధనకు ప్రత్యేకంగా శ్రద్ధ కనపరచడం మంచి విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలకుంట వీరయ్య, మేడూరి రాజేంద్ర ప్రసాద్, గాదెంశెట్టి సురేష్ కుమార్, అచ్యుత ప్రసాద్, వంకా రాధాకృష్ణమూర్తి, కొమ్మూరి బాపనయ్య, మోటుమర్రి రమేష్ బాబు, చామర్తి లక్ష్మీ పార్వతి రాజారావు, జి. ప్రియాంక పాల్గొన్నారు.



అశోక్ కుమార్, రమేష్‌తో యోగా శిక్షణార్థులు

పాలిటెక్నిక్ కాలేజీ అధ్యాపకురాలికి డాక్టరేట్

గుంటూరు ఎడ్యుకేషన్: నల్లపాడులోని మద్ది బాలా త్రిపుర సుందరి (ఎంబీటీఎస్) ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ అధ్యాపకురాలుగా పనిచేస్తున్న నార్నే సురేఖకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. యూనివర్సిటీ పరిశోధన విభాగ డైరెక్టర్ ప్రొఫెసర్ కొల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో 'ఆప్టిమైజేషన్ ఆఫ్ ప్రిన్సిపల్ డైమెన్షన్స్ ఆఫ్ ఏ రేడియల్ ఫ్లో గ్యాస్ టర్బైన్ రోటర్ యూజింగ్ జెనెటిక్ అల్గోరిథం అండ్ యాంట్ కాలనీ ఆప్టిమిగేషన్ అల్గోరిథం' అంశంపై చేసిన పరిశోధనకు ఆమెకు పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సురేఖను కళాశాల ప్రిన్సిపాల్ టి. శేఖర్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి వి.వి. కోటేశ్వరరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.



సురేఖ

శ్రీనిధి రుణాలతో డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధి

పెదకాకాని: డ్వాక్రా సంఘాల మహిళలకు శ్రీనిధి బ్యాంక్ అందిస్తున్న రుణాలు ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నాయని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. శ్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి చెందుతున్న మహిళలు బీహార్ రాష్ట్ర ఆర్థికశాఖ ప్రతినిధుల బృందంతో గురువారం పెదకాకానిలో సమావేశం ఏర్పాటు చేశారు. డ్వాక్రా మహిళలు శ్రీనిధి రుణాల సద్వినియోగం చేసుకునే విధానాన్ని పరిశీలించేందుకు గుంటూరు జిల్లాకు వచ్చిన బీహార్ రాష్ట్ర ఆర్థికశాఖ ప్రతినిధులు పుష్పేంద్రసింగ్ తివారీ, అషితోష్ కుమార్‌లు గురువారం పెదకాకాని చేరుకున్నారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. గతంలో రాష్ట్రంలో రూ.600 కోట్లతో ప్రారంభమైన శ్రీనిధి బ్యాంక్ ప్రస్తుతం రూ.6 వేల కోట్లకు టర్నోవర్‌కు చేరుకుందన్నారు. డ్వాక్రా సంఘాల్లోని మహిళలు శ్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి చెందుతున్న విధానాన్ని తెలుసుకునేందుకు బీహార్ ప్రభుత్వ బృందం పెదకాకానిలో పర్యటించిందన్నారు. కార్యక్రమంలో గుంటూరు శ్రీనిధి బ్యాంక్ డీజీఎం ధర్మేంద్ర, ఏజీఎం హర్షవర్ధన్, మేనేజర్ రాజా కుమార్, ఏపీఓ రాజు, యానిమేటర్లు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న విజయలక్ష్మి, బీహార్ ప్రతినిధులు

వివాహిత ఆత్మహత్య

పట్నంబజారు: భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసు స్టేషన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ రహమాన్ తెలిపిన వివరాల ప్రకారం.. లాలాపేటలో నివాసం ఉండే షేక్ గౌస్ కుమార్తె సుమైఫిర్‌దోస్ (19)ను యానాది కాలనీ దుర్గానగర్‌కు చెందిన మెకానిక్ షేక్ బాజీతో 25 రోజుల కిందట వివాహం చేశారు. అప్పటి నుంచి బాజీ భార్యను వేధింపులకు గురి చేస్తున్నాడు. ఇద్దరి మధ్యా ఈనెల 25న వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపం చెందిన సుమై ఫిరోదోస్ వంటగదిలోని హుక్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి గౌస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిషేధిత కలుపు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు




దుకాణాల్లో స్టాకును పరిశీలిస్తున్న ఏవో షేక్ సుగుణ బేగం

కాకుమాను: ఎరువులు, పురుగు మందు దుకాణాలలో నిషేధిత కలుపు మందులు విక్రయిస్తే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసు నమోదు చేస్తామని ఏఓ వి.సుధాకర్ హెచ్చరించారు. మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం కలుపు మందులను నిషేధించిందని తెలిపారు, ముఖ్యంగా గ్లైపోసినేట్ మందును పూర్తిగా నిషేధించినట్లు ఆయన పేర్కొన్నారు. దుకాణాలలో నిషేధిత పురుగు మందులు విక్రయించినా, కొనుగోలు చేసిన అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా దుకాణాలలో పురుగు మందులు, స్టాకు వివరాల రిజిస్టర్‌లను ఆయన పరిశీలించారు.

ప్రత్తిపాడులో..

స్థానిక ఫెర్టిలైజర్ దుకాణాల్లో గురువారం మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణ బేగం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాల్లో స్టాక్, సేల్ రిజిస్టర్లతో పాటు అందుబాటులో ఉన్న విత్తనాల ప్యాకెట్లు, వాటికి సంబంధించిన బిల్లులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని తెలిపారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో వారికి కచ్చితంగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

మురుగుతో విద్యార్థుల అవస్థలు



చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరు సెయింట్ మేరీస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మురుగు సమస్యతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.రఘువీర్ వద్ద ప్రస్తావించగా ఆయన నాయకులతో కలిసి గురువారం కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కళాశాల పరిసరాలలో మురుగు నీరు నిల్వ ఉండడంతో కళాశాలకు రాకపోకలు సాగించే విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు. కళాశాల, హాస్టల్‌లోని మురుగు బయటకు వెళ్లే ప్రాంతంలో అడ్డుకట్ట వేయటంతో ప్రధాన ద్వారం ఎదురుగా మురుగు ఆగిపోవటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రణీత్, అమర్నాథ్, డేవిడ్, కిరణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చని భూమిని పరిరక్షించాలి

- వైఎస్సార్ కడప నుంచి కశ్మీర్ వరకు యువకుడి సైకిల్ యాత్ర
- గుంటూరు నగరంలో ఘన స్వాగతం

నగరంపాలెం: పచ్చని భూమిని ప్రతి ఒక్కరూ కాపాడాలంటూ దేశ యాత్రలో భాగంగా గురువారం నగరంలోకి ప్రవేశించిన సైకిల్ యాత్రికుడికి బ్రాహ్మణ చైతన్య వేదిక, చాణిక్య ఫ్రెండ్ సర్కిల్ స్వాగతం పలికారు. వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన డిగ్రీ విద్యార్థి కోట కార్తిక్ మొక్కలు నాటాలని, వాతావరణంలో కాలుష్యాన్ని నిర్మూలించాలంటూ వారం రోజుల కిందట సైకిల్ యాత్ర ప్రారంభించారు. గుంటూరు వచ్చిన అతనికి భోజన, వసతి సౌకర్యాలను కల్పించారు. ఈ సందర్భంగా కార్తిక్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో తనకు రెండు లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారని, వారే బస, భోజన సౌకర్యాలను కల్పిస్తున్నారని చెప్పారు. యాత్ర నెలన్నరకు పైగా సాగుతుందని తెలిపారు. బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ మాట్లాడుతూ నేటి యువతకు కార్తిక్ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. చిన్న వయసులో భూమిని కాపాడాలని, చెట్లను నాటాలని, కాలుష్యాన్ని తగ్గించాలని సైకిల్ యాత్ర చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. ప్రతి గ్రామ, పట్టణ ప్రాంతాల్లో సైకిల్ యాత్రికునికి సంఘీభావం తెలిపాలని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిలుమూరు ఫణి, సుధీర్, ఎండపల్లి శబరి, ఫణి, నాగరాజు, వడ్లమూడి రాజా, నాగేశ్వరరావు, రఫీ పాల్గొన్నారు. జెండా ఊపి శ్రీధర్ యాత్రను పునః ప్రారంభించారు.



జెండా ఊపి సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న శ్రీధర్ తదితరులు

నటుడు సత్యనారాయణకు కళాసేవా పురస్కారం



సత్యనారాయణను సత్కరిస్తున్న నిర్వాహకులు

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళా వేదికపై గురువారం జై భవానీ పూర్వ అధ్యక్షులు బీవీ రావు 19వ వర్ధంతి సందర్భంగా కళాసేవా పురస్కార సభ నిర్వహించారు. బీవీ రావు మెమోరియల్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి నటులు ఏంవీఎల్ నరసింహారావు అధ్యక్షత వహించారు. తొలుత ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, జై భవానీ నాట్య మండలి అధ్యక్షులు ఐతి వాసుదేవశర్మ, బి.శ్రీనివాస్, పురస్కార ప్రదాత వి.ఎస్.వి.ఎస్.రోహిత్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రసిద్ధ నటులు, గుణ నిర్దేశ పరిషత్ నిర్వాహకులు మానాపురం సత్యనారాయణను కళాసేవా పురస్కారంతో సత్కరించారు. అనంతరం కె. ఆదిత్య రచించి, కె.వి.మంగారావు దర్శకత్వం వహించిన 'మిణుగురు – వెలుగులు' నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆరె పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధి తాడేపల్లి అంజిరెడ్డి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ కృష్ణా కెనాల్ డిపో మేనేజర్ కుబేర, మేనేజర్ క్యాసి వాగ్య మాట్లాడుతూ.. ఫోర్టిఫైడ్ రైస్‌పై ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని సూచించారు. బియ్యానికి జింకు, ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 వంటి విటమిన్లు పోషకాలను కలిపిన కెర్నల్స్ మారుస్తారని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఐ కృష్ణ కెనాల్ డిపో సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.